క్లుప్తంగా

ఒంటరి మహిళలకు చేయూత



చిలకలూరిపేట: ఒంటరి మహిళలకు బాసటగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జాష్టి విష్ణుప్రియ తెలిపారు. అసిస్ట్, కేఎస్‌పీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని 300 మంది ఒంటరి మహిళలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు విలువ చేసే 13 రకాల నిత్యావసరాలను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేఎస్‌పీ సంస్థ ప్రతినిధి ఆస్మా పాల్గొన్నారు.

పంట కుంటలు కోసం దరఖాస్తులు

నూజెండ్ల: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలాల్లో పంట కుంటలు(ఫామ్ పాండ్) ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ ఆంజనేయరాజు శుక్రవారం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్, జిరాక్స్‌లతో ఆయా గ్రామాల్లోని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు అందజేయాలని సూచించారు.

12న చలో విజయవాడ

నరసరావుపేట: ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకై ఈ నెల 12న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవి బాబు పిలుపునిచ్చారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విజయవాడ మహాధర్నా కరపత్రాలను వివిధ సంఘాల నాయకులతో కలసి ఆవిష్కరించారు.

నేడు ఉచిత ఓపీ సేవలు

చిలకలూరిపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లో మహిళలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత ఓపీ సేవలు అందిస్తున్నట్లు యూరాలజిస్టు డాక్టర్ లింగా అప్పారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ: మండలంలోని పార్వతీపురం వద్ద శుక్రవారం మిర్చి లోడుతో వెళ్తున్న లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు.వివరాలు.. శ్రీశైలం నుంచి గుంటూరుకు మిర్చి లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఆటో డ్రైవర్ త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన టి. యల్లయ్య(46) అక్కడికక్కడే మృతిచెందాడు.

రఫీకి పరామర్శ

వినుకొండ: మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన షేక్ రఫీపై టీడీపీ నాయకులు అక్రమంగా కేసు బనాయించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి దూపాటి నాని, పట్టణ కార్యదర్శి షేక్ ఫిరోజ్, గుంటి నాగేశ్వరరావు, అందుగులపాటి పెద్ద వెంకటేశ్వర్లు, మునగపాటి ప్రసాద్‌లు రఫీని పరామర్శించారు.

రేషన్ పంపిణీ పరిశీలన

శావల్యాపురం: రేషన్ పంపిణీ నూరుశాతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సభావత్ సురేష్‌నాయక్ కోరారు. మండలంలోని కొత్తలూరులో రేషన్ పంపిణీని శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా ఉండాలని కోరారు.

బహిరంగ ప్రకటన

[illegible]

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



చిలకలూరిపేటలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు



నరసరావుపేటలో ఎస్ఎంసీ చైర్మన్ నజ్మా, ఉపాధ్యాయినీ అపర్ణలను సత్కరిస్తున్న దృశ్యం



వినుకొండలో టీచర్స్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జయమ్మ మాట్లాడుతూ సామాజిక సేవల విషయంలోనూ మహిళలు ముందంజలో ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి తమ సంస్థ కృషి చేస్తున్నదని వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ కందిమళ్ల జయమ్మ, డాక్టర్ లావు అరుణ, డాక్టర్ మధులతలను ఘనంగా సన్మానించారు. డాక్టర్ గట్టు రంగారావు సహకారంతో వంద మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. జాష్టి ప్రమీల సహకారంతో దివ్యాంగురాలైన మహిళకు వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళా శక్తికి గౌరవ సత్కారం



యడ్లపాడులో మహిళా దినోత్సవంలో పాల్గొన్న వివిధ శాఖల ఉద్యోగులు

యడ్లపాడు: మహిళల సమగ్రాభివృద్ధికి అనేక ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ పేర్కొన్నారు. యడ్లపాడు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపీ వీఆర్వో అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి, పల్నాడు జిల్లా మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.హేమలతాదేవి, జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు అనూరాధ, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె.ఎ.చారి, మహిళా విభాగ కార్యదర్శి పద్మావతి, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అధికారి మల్లేశ్వరీ, పీటీడీసీ అధ్యక్షురాలు షేక్ దిల్‌షాద్‌బేగం, డీటీ ఎస్.అనూరాధ, యడ్లపాడు ఎంఈఓ ఎంవీ నాగరత్నం, తిమ్మాపురం వీఆర్వో జగన్ మోహన్‌రావు పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహిళలచే కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.



శావల్యాపురంలో అభివాదం చేస్తున్న ఎంఈఓ, మహిళా ఉపాధ్యాయులు

గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో...

జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బీసీ బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. హాస్టల్ వార్డన్ దుర్గాదేవిని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మి, దార్ల బుజ్జిబాబు, గేరా యాకోబు, షేక్ బాజి, ధూళిపాళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమాజ అభివృద్ధి

నరసరావుపేట రూరల్: మహిళా సాధికారత సాధించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎస్ఆర్‌కేటీ కాలనీ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురులింగం తెలిపారు. పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ షేక్ నజ్మా, ఉపాధ్యాయినీ అపర్ణలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలకు స్వేచ్ఛను ఇవ్వడం ద్వారానే కుటుంబం వృద్ధి సాధిస్తుందని తెలిపారు. స్త్రీలు కూడా పురుషులతో సమానమని, మహిళల ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించినట్టు తెలిపారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని మునుమాకలోని పాఠశాల్లో శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ షేక్ అశ్రీఫును, మహిళా ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి డి.బ్రహ్మేశ్వర రావు, ప్రధానోపాధ్యాయులు రామయ్య, ఉపాధ్యాయులు నాగలక్ష్మి పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ: పట్టణంలోని లయోలా ఇంగ్లిష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లులను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా టీచర్స్ వీర, రాజేశ్వరి, మేరి, లక్ష్మీశైలజలను దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: మహిళలు ఇంటిని దిద్దుకోవడమే కాకుండా కొంత సామాజిక సేవా దృక్పథం కూడా కల్గియుండాలని ఎంఈఓ-2 పుసులూరి లలితకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల స్థాయిలో మహిళా ఉపాధ్యాయుల సారథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి



మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అనుబంధ విభాగాల సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఏడీఏ మస్తానమ్మ, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి, మండల వ్యవసాయ అధికారి నరేంద్రరెడ్డి, మండల ఉద్యానశాఖ అధికారి నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్‌కు ముందు ప్రతి రైతు తన పొలంలో పీఎండీఎస్(నవధాన్య) విత్తనాలు చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం వలన చీడపీడల నివారణ జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ నవధాన్య విధానం వలన భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవుల వృద్ధి చెందడం, భూమికి కార్బన్ శాతం చేరడంతో పాటు పశువుల మేతగా ఉపయోగపడుతుందని వివరించారు. ఉద్యాన అధికారి నవీన్ మాట్లాడుతూ రసాయన పురుగు మందులు అధికంగా ఉపయోగించడంతో ప్రస్తుత మార్కెట్లో లభిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు విషపూరితంగా మారి క్యాన్సర్, గుండె జబ్బులకు దారితీస్తున్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులకు కార్యక్రమంలో సన్మానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మండలం పరిధిలోని కావూరు, పసుమర్రు, మురికిపూడి, రామచంద్రాపురం గ్రామాల పరిధిలో కూడా సరఫరా ఉండదన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఎస్ఈ విజయ్‌కుమార్



సబ్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్

వినుకొండ: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్ ఆదేశించారు. మండల పరిధిలోని ఏనుగుపాలెం, చీకటీగలపాలెం, నీలగంగవరం, బ్రాహ్మణపల్లి, జగనన్న కాలనీ సబ్‌స్టేషన్‌లను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు. సబ్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది సమష్టి కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకుంటుందని వివరించారు. అనంతరం ఆయన సబ్‌స్టేషన్‌లలో మొక్కలు నాటారు. ఆయన వెంట డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసరావు, ఏఈ జీఎస్‌రావు ఉన్నారు.

వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

ఈపూరు(శావల్యాపురం): వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు డీఈ సీహెచ్ రాంబోట్లు వెల్లడించారు. శుక్రవారం ఈపూరు మండలం ఊడిజర్ల, కొచ్చర్ల, ఈపూరు, ముప్పాళ్ల గ్రామాల్లోని విద్యుత్ ఉప కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఈపూరు విద్యుత్ సబ్‌స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఈ రాంబొట్లు మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రూ.73 లక్షల బకాయిలు ఉన్నట్లు చెప్పారు. ఇంటి కనెక్షన్లు బకాయిలు రూ.94లక్షలు, వీధి దీపాలు బకాయి రూ.23 లక్షలు మండలంలో ఉందన్నారు. నూరుశాతం వసూలు అయ్యే విధంగా విద్యుత్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. రేమిడిచర్ల, ఈపూరు, రొంపిచర్ల 132 కేవీ సబ్ స్టేషన్లు ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని చెప్పారు. సమావేశంలో ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డి, ఏఈ సంపెంగుల గాంధీ, లైన్ ఇన్‌స్పెక్టరు భవనాశి రవికుమార్, లైన్‌మెన్స్ మేడికొండ ఆనంద భాగ్యయేహోనుకుమార్, ఎం.రమణానాయక్ ఉన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 22 మంది ఎంపిక

చిలకలూరిపేట: స్థానిక డీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 22 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎంపికైన నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత తెలిపారు. ఇంటర్వ్యూలలో మల్టీనేషనల్ కంపెనీలైన కనెక్ట్ సొల్యూషన్స్, ఆల్డిజీ కంపెనీల హెచ్‌ఆర్‌లు అజయ్ గోవిందరాజు, సలీం ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి ఎంవీ శివానందకుమార్, సంయుక్త కార్యదర్శి బేతంచర్ల కోటేశ్వరరావు, కోశాధికారి బి.రామలింగేశ్వర రావు అభినందనలు తెలిపారు.

డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నరసరావుపేట ఈస్ట్: డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం... మేలుకో యువత.. మేలుకో అంటూ కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు వీధుల వెంట నినదించారు. ఆట పాటలతో మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించారు. కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే వాక్, ఫెస్ట్-2025లో భాగంగా శుక్రవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణ ప్రధాన కూడళ్లలో విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ ద్వారా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి



మహిళా గ్రూపులకు రుణాల చెక్కు అందజేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రుణమేళాల ద్వారా రుణాలు తీసుకునేందుకు బ్యాంకులను ఉపయోగించుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం రావిపాడురోడ్డులోని ఎస్‌పీ గ్రాండ్‌లో యూనియన్ బ్యాంక్ అనుబంధ సంస్థలు నిర్వహించిన వికసిత్ భారత్ బ్యాంకింగ్ ఎంఎస్ఎంఇ మెగా రుణమేళాకు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ మాధవి, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మిరప పంటలో సస్యరక్షణ

నూజెండ్ల: మిరప పంటలో తెగుళ్ల నివారణకు రైతులు సత్వరమే సస్యరక్షణ చేపట్టాలని నరసరావుపేట ఏరువాక కేంద్రం ప్రతినిధి డాక్టరు ఎం.నగేష్ అన్నారు. మండలంలోని పమిడిపాడు, ముక్కెళ్లపాడు గ్రామాల్లో మిరప పంట సాగు చేసిన పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంటలో వేరుకుళ్లు తెగులు, కాయకుళ్లు, బ్యాక్టీరియల్ ఆకుమచ్చ, పోషకంలో నవరణ, తెల్లదోమ, తామరపురుగు, వైరస్ తెగులు వాటి బారిన పడకుండా జాగ్రత్తలతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని చెప్పారు. ఆయనతో పాటు వినుకొండ ఉద్యాన శాఖాధికారి షేక్ నబీ రసూల్, హిమబిందు, వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

వినుకొండ: పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు విశ్వహిందూ పరిషత్ సహకారంతో శుక్రవారం ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.